క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం



ఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట : మెయిన్ రోడులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మన్యు సూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమం వల్ల నర ఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి చేకూరుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి కోవిడ్ నిబంధనలను అనుసరించి ఈ హోమం నిర్వహించారు.

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: రుషి గాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే 14 రోజుల ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. లాసన్స్‌బే కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 9న సాయంత్రం 6 గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు 94403 95439 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అప్పుడే నయం..

- పాతనగరానికి బస్సు సౌకర్యం ఉండేది
- ఇప్పుడు ఆటోలే దిక్కు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రెల్లివీధి, చెంగల్రావుపేట, ఏవీఎన్ కాలేజీ ప్రజలు





పాతనగరం

దాబాగార్డెన్స్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యానికి చేరుకోండి.. అంటూ ఆ సంస్థ చెబుతుంటుంది. అసలు ఆర్టీసీ బస్సే లేకపోతే సురక్షితమైన ప్రయాణం ఎలా సాగుతుందో అధికారులకే తెలియాలి. ఫలితంగా ఆటోల దందా మితిమీరుతోంది. ఇష్టానుసారంగా ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. బస్సు పాస్‌లు తీసుకున్నా.. బస్సు సౌకర్యం లేకపోతే ఇటు విద్యార్థులు.. అటు ప్రభుత్వ.. ప్రైవేట్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నగరంలోనే కాదు.. జిల్లా నలుమూలలకు బస్సు సౌకర్యం కల్పించింది. అంతవరకూ బాగానే ఉంది. ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగానూ ఉంది. అయితే నగర నడిబొడ్డు.. విశాఖపట్నానికి ఆయువు పట్టు అయిన పాతనగరంలో పలు ప్రాంతాలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదంటే విన్నవారెవ్వరైనా ముక్కు మీద వేలేసుకుంటారు. నగరం విస్తరిస్తున్నా.. వాహనాల రాకపోకలు జోరుగా సాగుతున్నా.. పాతనగరంలోని రెల్లివీధి, జబ్బరతోట, పెయిన్‌దొరపేట, కోడివంద్యాలవీధి, చెంగల్రావుపేట, జాలారిపేట, కదిరి దానప్పవీధి, గొడారిగోతులు, ఏవీఎన్ కాలేజీ తదితర ప్రాంతాల వాసులు ఆర్టీసీ బస్సుకు నోచుకోవడం లేదంటే విడ్డూరంగానే ఉంది. ఆయా ప్రాంతాల వాసులు నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే ఇటు కలెక్టర్ కార్యాలయం.. అటు టౌన్‌కొత్తరోడ్డు వెళ్లాల్సిన దుస్థితి. అంత ఓపిక లేనివారు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. కొంత మంది వారి ద్విచక్రవాహనాలనే వినియోగిస్తున్నారు.

బస్సు పాసులున్నా..

ఈ ప్రాంతంలో అనేక మంది ఆర్టీసీ బస్సు పాసులు తీసుకున్నా ఫలితం లేదంటున్నారు. వేరే ప్రాంతానికి/ఉద్యోగానికి/పాఠశాల/కళాశాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్సుల్లో వెళ్లేకన్నా రూ.20.. రూ.30 పెట్టి ఇటు కలెక్టర్ ఆఫీసో.. అటు టౌన్‌కొత్తరోడ్డుకో ఆటోలపై వెళ్లి తాము వెళ్లాల్సిన చోటుకు అక్కడ బస్సు ఎక్కాల్సి వస్తోందని సాక్షి దృష్టికి తీసుకొచ్చారు.

గతంలో 11సీ..13ఏ..

దశాబ్దన్నర కిందటి వరకు ఈ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. 11సీ, 13ఏ నంబర్లు కలిగిన ఆ బస్సులు హెచ్‌బీ కాలనీ నుంచి జగదాంబ, కేజీహెచ్ అప్‌రోడ్డు, కలెక్టర్ కార్యాలయం, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ మీదుగా పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డుకు చేరి అక్కడి నుంచి పాత పోస్టాఫీస్ వెళ్లేవి. అలాగే తిరుగు ప్రయాణంలో పాతపోస్టాఫీస్ వద్ద బయలుదేరి, లక్ష్మీటాకీస్ జంక్షన్, టౌన్‌కొత్తరోడ్డు, రాజారామ్మోహన్ రాయ్ ఏరియా మీదుగా ఏవీఎన్ కాలేజీ అప్‌రోడ్డు, రెల్లివీధి, కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్ డౌన్, లేపాక్షి జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించేవి. ఉదయం.. మధ్యాహ్నం.. సాయంత్రం.. రాత్రి వేళల్లో ఇవి నడుస్తూ ప్రయాణికులకు వెసులుబాటుగా ఉండేవి. రెల్లివీధి, పెయిన్‌దొరపేట, కోడివంద్యాలవీధి, జబ్బరతోట తదితర ప్రాంతాలతో పాటు ఏవీఎన్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. తర్వాత ఆ సర్వీసులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంత వాసులు ఆర్టీసీ బస్సుకు నోచుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు. ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత అధికారులదేనని పాతనగర వాసులు అభ్యర్థిస్తున్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



లక్ష్మీహోమంలో పాల్గొన్న ఈవో రమేష్ నాయుడు, పలువురు ఉభయదాతలు



సహస్ర తులసి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 16 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, అనురాధ, మారుతీ ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితుడు జి. ప్రకాష్, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన రక్షణగిరి



ముస్తాబవుతున్న జ్ఞానాపురం రక్షణగిరి

కంచరపాలెం: జ్ఞానాపురం రక్షణగిరిలో ఈ నెల 7 శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సెయింట్ పీటర్స్ పునీత పేతురు దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ డాక్టర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖ ఆర్చి బిషప్ (అతిమేత్రానులు) ఫాదర్ మల్లావరపు ప్రకాష్ విచ్చేయనున్నట్లు తెలిపారు. రెవరెండ్ ఫాదర్ల నేతృత్వంలో శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి శిలువ మార్గం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేయనున్నట్టు ఫాదర్ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి రక్షణగిరి వరకు నిర్వహించే శిలువ మార్గ ప్రార్థనల్లో క్రైస్తవ భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళలకు చీరల పంపిణీ



ప్రేమసమాజంలో పండ్లు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ, కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ, మూలే రామిరెడ్డి తదితరులు

అల్లిపురం: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ జన్మదిన వేడుకలు గురువారం 32వ వార్డులో ఘనంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రేమసమాజం పిల్లలకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సేవా కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: బొల్లవరపు జాన్‌వెస్లీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 36వ వార్డు ప్రేమసమాజం కుష్ఠు నివారణ కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు నేతృత్వంలో జాన్‌వెస్లీ చేతుల మీదుగా వృద్ధులకు పండ్లు, రొట్టెలు, మహిళలకు చీరలు అందజేశారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా పరిషత్ సమీపాన గల సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రంధి గోపి, మహ్మద్ షరీఫ్, ఈశ్వరరావు, బుల్లెట్ రవి, బొండాడ వెంకట్రావు, ఆరుగుల రాజ్‌కుమార్, సారిపల్లి పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం అయ్యేందుకే

- 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం
- ర్యాలీలో వెల్లడించిన ఎమ్మెల్యే వాసుపల్లి



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్, ఇతర నాయకులు

సీతమ్మధార : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారా అంటే అది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మీడియా సమావేశం అనంతరం గాంధీ విగ్రహం నుంచి గొల్లలపాలెం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో వినూత్న కార్యక్రమం చేపట్టబోతుందని, ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి ×జగనన్నే మా భవిష్యత్తు¥అంటూ ప్రజల ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రెండు వేల మంది సైనికులతో ముందుకు సాగుతామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రతి ఒక్కరికి వివరించేందుకు 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ప్రతి వార్డు, సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లు, ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు, మరికొన్ని చోట్ల ముగ్గురు చొప్పున గృహ సారథులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ పట్ల ప్రజల అభిప్రాయాన్ని, వారి సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన పాదయాత్రకు వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రజలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫిషరీస్ చైర్మన్ కోలా గురువులు, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, రెల్లి కుల చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, శ్రీ కనకమహలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహచలం, కార్పొరేటర్లు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వస్తు ప్రదర్శన

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం వస్తు ప్రదర్శన, విక్రయాలు నిర్వహించారు. నగరంలో సెయింట్ జోసఫ్ కాలేజీ ఫర్ ఉమెన్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడు నెలల పాటు బ్లాక్, స్క్రీన్ ప్రింటింగ్‌లలో శిక్షణ పొందారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ మేరకు విద్యార్థులు ఇక్కడ శిక్షణ కాలంలో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి, విక్రయాలు చేపట్టారు. ఈ ప్రదర్శనను దయాల్‌బాగ్ రాధాస్వామి సత్సంగ్ ఆంధ్రా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ వి.వి.జి.శాస్త్రి ప్రారంభించారు. ఇక్కడ సుమారు రూ.20వేలు విలువైన వస్తువులను ప్రదర్శించగా.. రూ.18 వేలు విలువైన వస్తువులు విక్రయించినట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ కాలేజీ అధ్యాపకులు, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి వినతి



జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా 41వ వార్డులో మరియదాసు కల్యాణమండపం, జీ+3 నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సినిమా హీరో, దివంగత సూపర్‌స్టార్, నటశేఖర్ కృష్ణ కాంస్య విగ్రహం బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్‌ను కలసిన వారులో 41వ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య కె.సమత గురువారం పరిశీలించారు. భౌతిక శాస్త్ర విభాగంలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పటిష్టంగా పరీక్షలు నిర్వహించడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాలలో వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో చైత్ర మాసం పౌర్ణిమ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవుడికి ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించారు. సేవా దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఉదయం 8.30 గంటలకు భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 10.30 గంటలకు శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన చేశారు. ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలను శ్రీవారి శాలువా, కండువాతో ఆలయ అర్చకుడు వాసుదేవచార్యులు సత్కరించి వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు. మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద గోష్టి జరిగింది. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కల్యాణ మండపం అందుబాటులోకి తేవాలి

కంచరపాలెం: జ్ఞానాపురంలోని బిషప్ కాగితపు మరియదాస్ కల్యాణ మండపాన్ని పేద ప్రజల అందబాటులోకి తీసుకువాలని జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు ఆంథోని శేఖర్ ఆధ్వర్యంలో జోన్–5 కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. డాక్టర్ శ్రీనివాసరావు, కందుల నాగరాజు, శివప్రసాద్‌రెడ్డి, రూప పాల్గొన్నారు.

పరిశుభ్రతకే ప్రాధాన్యం



పాతపోస్టాఫీసు ప్రాంతంలో చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: పరిశుభ్రతకు ప్రాధాన్యతనీయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. గురువారం ఆయన పూర్ణామార్కెట్, పాతపోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ప్రధానంగా రహదారులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయాన్నే చెత్తపోగులను యార్డులకు తరలించాలన్నారు. బ్లాక్‌స్పాట్లలో చెత్త ఉండకుండా చూసుకునే బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే అన్నారు. అనంతరం వార్డులో అన్ని ప్రధాన రహదారుల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పాదాలు కడిగిన రోజ్‌హిల్స్ డైరెక్టర్

అల్లిపురం: గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాతపోస్టాఫీస్ దరి రోజ్‌హిల్స్, మేరీ మాత దేవాలయం ఫాదర్ రెవరెండ్ కొండల జోసెఫ్ గురువారం సాయంత్రం భక్తుల పాదాలు కడిగారు. ఏసుప్రభువు ఆనాడు కొనసాగించిన సాంప్రదాయాన్ని తాను నేడు అమలు చేస్తున్నానని ఆయన తెలిపారు.

ఐదుగురికి కారుణ్య నియామకాలు



పోస్టింగ్ ఆర్డర్లు అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐదుగురికి కారుణ్య నియామకాలు అందజేస్తూ చైర్‌పర్సన్ జె. సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో తల్లిదండ్రులను పోగొట్టుకొని కుటుంబానికి ఎటువంటి ఆసరా లేక ఇబ్బంది పడుతున్న వారి కోసం నియామకాలు చేపట్టామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి తాను ఇచ్చిన ఆదేశాల మేరకు తక్కువ సమయంలో కారుణ్య నియామకాల ప్రక్రియను పూర్తి చేసి సహకరించారని చైర్‌పర్సన్ కొనియాడారు. ఉద్యోగాలు పొందిన వారితో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానం ప్రకారం ఉద్యోగాలు కల్పించామన్నారు. వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో పరిశోధనపై వర్క్‌షాప్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర పరిశోధనలపై గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పరిశోధకురాలు ప్రొఫెసర్ మార్గరేట్ ఫిలిప్స్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రపంచం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తున్నా వివిధ దేశాల్లో ఇప్పటికీ తమకు జరిగిన అన్యాయాలను న్యాయ స్థానాల దృష్టికి తీసుకెళ్లాలన్న అవగాహన ప్రజల్లో లేకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు, ప్రొఫెసర్ బి.నళిని, తదితరులు పాల్గొన్నారు.